
## లిస్టులో పేరు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి.



* పీసీసీ సభ్యులు ధరణాల కోట శ్రీను.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 13:** ఓటరు జాబితా లిస్టులో పేరు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని పీసీసీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ తరపున 92వ బూత్ ఏజెంట్ గా ఉన్న ధరణాలకోట శ్రీను అన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా సోమవారం బూత్ లెవెల్ అధికారిని ఓటర్ జాబితాలో పేర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమయం ఎంతో లేనందున ఓటర్ల జాబితాలో ప్రజలంతా తమ పేరు నమోదు చేసుకోవాలని ధరణాలకోట శ్రీను కోరారు.


# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా


## 150 కోట్లతో ధవళేశ్వరం బ్యారేజ్

# 117 గేట్ల ఆధునికీకరణకు శ్రీకారం




### గోదావరి డెల్టా రైతాంగానికి అండగా సీఎం చంద్రబాబు..

### రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు






**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 13 :** గోదావరి డెల్టా రైతాంగ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి రూ.150 కోట్ల వ్యయంతో 117 గేట్ల ఆధునికీకరణ, మరమ్మత్తు పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక నిర్ణయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. గోదావరి డెల్టా వ్యవసాయానికి జీవనాడిగా నిలిచిన బ్యారేజీని భవిష్యత్ తరాలకు భద్రంగా అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పనులను చేపట్టిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పిచ్చుకలంకలో నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని, రైతు సంక్షేమాన్ని ప్రభుత్వ విధానంలో కేంద్రబిందువుగా నిలిపిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని కొనియాడారు. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి జలాలను సద్వినియోగం చేసి ఈ ప్రాంతాన్ని అన్నపూర్ణగా మార్చగా, నేడు ఆ వ్యవస్థను పరిరక్షించేందుకు సీఎం చంద్రబాబు ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బ్యారేజీ నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, కనీస మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడంతో బ్యారేజీ భద్రత ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ఈ పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి వెంటనే స్పందించి రూ.150 కోట్లతో 117 గేట్ల మార్పిడి, ఆధునికీకరణ పనులను ప్రారంభించడం గోదావరి డెల్టా రైతులపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నాయకత్వంలో శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని ప్రశంసించిన ఎమ్మెల్యే, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటి భద్రత కల్పించడం, పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడం, వెలుగోడు నిర్వాసితులకు పరిహారం అందించడం వంటి చర్యలు రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి వాడపల్లి దేవస్థానం అభివృద్ధి, పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం, ఏటిగట్ల బలోపేతం, నదీపాత నివారణ, కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం, ఎమ్మార్వో కార్యాలయ నిర్మాణం, వంతెనల నిర్మాణం, వ్యవసాయ మార్కెట్‌కు స్థల కేటాయింపు, పేరూరు వై జంక్షన్ నుంచి రావులపాలెం వరకు ప్రతిపాదిత జాతీయ రహదారి అభివృద్ధి వంటి అంశాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గోదావరి డెల్టా ఆధునికీకరణకు కూడా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, కాటన్ నిర్మించిన సాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు బండారు సత్యానందరావు తెలిపారు. రైతు సంక్షేమం, నీటిపారుదల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.

## మరిడమ్మ జాతర ఉత్సవం ప్రారంభం

ఉత్సవాలకు ఏర్పాటు పూర్తి

అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి

వివరాలు 4లో..


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

'ఐదు రోజులకు'

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

షరతులు వర్తిస్తాయి


# గుక్కెడు నీటికోసం గగ్గోలు







* బీటలు వారిన నారుమళ్లు
* కాజులూరు రైతాంగానికి సాగునీటి శాపం
* గోదావరిలో నీరు సముద్రంలో కలుస్తుంటే... కోరంగి కెనాల్ ఆయకట్టుకు చుక్క నీరు లేదు
* వెదజల్లిన చేలు ఎండిపోయి బీటలు...
* నాట్లపై సందిగ్ధం... అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

**కాజులూరు, పెన్ పవర్, జూలై 13:** కాజులూరు మండలంలో తొలకరి వరి సాగు ప్రారంభం కాకముందే సాగునీటి ఎద్దడి రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. గోదావరిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తున్నా, కోరంగి కెనాల్ పరిధిలోని గొల్లపాలెం, శలపాకం నీటిసంఘాల ఆయకట్టు రైతులకు మాత్రం చుక్క నీరు అందని దుస్థితి నెలకొంది. ఫలితంగా రైతులు ఎంతో ఆశతో వెదజల్లిన నారుమళ్లు నీరందక ఎండిపోయి బీటలు వారగా, వేలాది రూపాయల పెట్టుబడి కళ్లముందే బూడిదవుతోంది. గొల్లపాలెం నీటిసంఘం పరిధిలోని అనేక పొలాల్లో వెద మడులు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "నీరు వచ్చేదెప్పుడు... నాట్లు వేసేదెప్పుడు?" అంటూ రైతులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు శలపాకం నీటిసంఘం పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దుక్కి దున్నేందుకు కూడా కాలువల్లో నీరు లేక సాగు పనులన్నీ నిలిచిపోయాయి. మొగలిపాలెం, మంజేరు, శలపాక, బంధనపూడి గ్రామాల్లో అధికారులు కాలువలకు నీరు వదిలారనే ప్రకటనలను నమ్మి సుమారు 80 ఎకరాల్లో రైతులు వెదజల్లారు. అయితే మధ్యలోనే నీటి సరఫరా నిలిచిపోవడంతో నారుమళ్లు పూర్తిగా ఎండిపోయాయి. కొంతమంది రైతులు బోర్లు, డీజిల్ ఇంజిన్లతో నీరు తోడే ప్రయత్నం చేసినా, పెరిగిన ఖర్చులతో చివరకు చేతులెత్తేశారు. "అన్నీ ఉన్నా... అల్లుడి నోట్లో శని" అన్న చందంగా గోదావరిలో నీరు ఉన్నా రైతు పొలానికి మాత్రం అందకపోవడం దురదృష్టకరమని రైతులు మండిపడుతున్నారు. సముద్రంలోకి లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతుంటే, పంటకాలువలకు మాత్రం నీరు అందక రైతాంగం విలవిల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శలపాక, తణుకువాడ, మొగలిపాలెం, గొల్లపాలెం, చేదువాడ, బంధనపూడి, మతుకుమిల్లి, మంజేరు, శీల గ్రామాల్లోని రైతులు ఒకే స్వరంతో సాగునీటి కోసం వేడుకుంటున్నారు. కోరంగి కెనాల్ పరిధిలో అత్యధిక వరి ఆయకట్టు ఉన్నప్పటికీ, కనీసం ఒక్క ఎకరం కూడా తడవలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి సరఫరాలో కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. "ఆనకట్ట వద్ద నీరు వదిలామని చెప్పుకోవడం తప్ప, ఆ నీరు మా పొలాల వరకు చేరిందా లేదా అన్నది ఎవరూ పట్టించుకోవడం లేదు" అంటూ అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సోమవారం రైతులు తమ సమస్యను గొల్లపాలెం నీటిసంఘం అధ్యక్షుడు సలాది శ్రీనివాసరావు, శలపాక నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి, డీసీ లకాని కృష్ణచైతన్య దృష్టికి తీసుకెళ్లారు. వారు మంజేరు, మొగలిపాలెం, శలపాక ప్రాంతాల్లో నారుమళ్లు, వెదజల్లిన చేలను స్వయంగా పరిశీలించారు. అయితే "నీరు ఎప్పుడు అందుతుంది?" అనే రైతుల ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోవడంతో రైతుల్లో అసంతృప్తి మరింత పెరిగింది. ఇప్పటికే వెదజల్లిన నారుమళ్లు చాలావరకు పనికిరాని స్థితికి చేరాయని, మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి అత్యవసరంగా సాగునీరు విడుదల చేయకపోతే ఈ సీజన్ మొత్తం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీరు సమృద్ధిగా అందుతుందన్న ఆశతో ఉన్న రైతులకు ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితి తీవ్ర నిరాశ కలిగించిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా మా పరిస్థితి మారింది" అంటూ తమ బాధను వ్యక్తం చేశారు. సాగునీటి సంఘం ప్రతినిధులు కూడా రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పి వెళ్లిపోవడంతో రైతుల్లో మరింత ఆగ్రహం వ్యక్తమైంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే రైతులంతా సంఘటితమై రోడ్డెక్కి ఉద్యమానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు. "రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పే నాయకులు, అధికారులు ఇప్పుడు రైతు కష్టాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు?" అంటూ ప్రశ్నిస్తున్నారు.

సాగునీరు లేక ఎండిపోయిన నారుమళ్లు... బీటలు వారిన చేలు... కళ్లముందే కరిగిపోతున్న రైతు ఆశలు... కాజులూరు మండల రైతాంగం ఎదుర్కొంటున్న ఈ దయనీయ పరిస్థితిపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కోరంగి కెనాల్ ద్వారా అత్యవసరంగా సాగునీరు విడుదల చేసి రైతును ఆదుకోవాలని రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

## మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన

* రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు





**గండేపల్లి, పెన్ పవర్, జూలై 13** రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు సోమవారం గండేపల్లి మండలంలోని పలు కుటుంబాలను పరామర్శించారు.

జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కందుల చిట్టిబాబు తల్లి సుభద్రమ్మ ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని కలిసి సానుభూతి తెలిపారు. సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మురారి క్లస్టర్ ఇన్చార్జి జాస్తి వసంత్ పెద్దతండ్రి జాస్తి రాధాకృష్ణ తల్లి మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సూరంపాలెం కుంచె చినబాబు తల్లి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో గండేపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కంటిపూడి సత్తిబాబు, గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, అక్కిన సుదర్శన్ రావు, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, ముంగర సూర్యారావు, పైల వెంకన్న, వెంపాటి రాంబాబు, ఉండవల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ త్వరగా కోలుకోవాలని వేలంకలో ప్రత్యేక పూజలు.

* ఉమా నీలకంఠేశ్వర స్వామికి భక్తి శ్రద్ధలతో అభిషేకాలు,అర్చనలు.





**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 13**:కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం, శివునికి ప్రీతిపాత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మాజీ మంత్రి, వైసీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ముద్రగడ అభిమానులు,గ్రామ ప్రజలుప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ పద్మనాభం ఆయురారోగ్యాలతో క్షేమంగా కోలుకుని కిర్లంపూడిలోని తన స్వగృహానికి తిరిగి రావాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం, ఆయన సతీమణి పద్మావతి పేర్లపై విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు కోరారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ముద్రగడ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా వైద్యారోగ్య శాఖకు కొత్త డీఎంహెచ్‌వో


**డాక్టర్ కె. అనిత నియామకం**



**కాకినాడ, పెన్ పవర్, జూలై 13:**కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి గా డాక్టర్ కె. అనిత నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిపాలనా కారణాలపై సివిల్ సర్జన్లు (జనరల్ లైన్) బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించి సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా, ఈ మేరకు ఆమెను కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు.డాక్టర్ అనిత 1998లో ఏలేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రభుత్వ సేవలను ప్రారంభించారు. అనంతరం 1999 నుంచి 2002 వరకు పిఠాపురంలో, 2002 నుంచి 2004 వరకు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో సేవలందించారు. 2004 నుంచి 2010 వరకు తిరిగి పిఠాపురంలో విధులు నిర్వహించగా, 2010లో కొంతకాలం రావికంపాడు పీహెచ్‌సీలో పనిచేశారు. అనంతరం 2010 నుంచి 2013 వరకు మరోసారి పిఠాపురంలో సేవలందించారు.2013లో డిస్ట్రిక్ట్ చైల్డ్ హెల్త్ (డీసీహెచ్) విభాగంలో పదోన్నతి పొందిన ఆమె పి. గన్నవరం బదిలీ అయ్యారు. 2014 జనవరి నుంచి 2017 వరకు కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ)గా కీలక బాధ్యతలు నిర్వహించారు.2017 నుంచి 2021 వరకు పెదపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా, 2021 నుంచి 2025 వరకు కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డీసీఎస్--ఆర్ఎంఓగా సేవలందించారు. 2025 జనవరిలో శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వాసుపత్రికి సీఎస్ఆర్ఎంఓగా బదిలీ కాగా, అక్కడ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.దాదాపు మూడు దశాబ్దాల సేవా కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ హోదాల్లో విశేష అనుభవం సంపాదించిన డాక్టర్ కె. అనిత ఇప్పుడు కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమె నియామకంతో జిల్లా వైద్య, ప్రజారోగ్య సేవలు మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతాయని వైద్యశాఖ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## బాలా త్రిపురసుందరి సమేత అగస్తేశ్వర స్వామివారి రథయాత్రలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు

### రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు





**రామచంద్రపురం, పెన్ పవర్, జూలై 13:**రామచంద్రపురం పట్టణంలోని శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీ అగస్తేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పవిత్ర రథయాత్రలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి సందర్భంగా మంత్రి సుభాష్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలు కలగాలని, రాష్ట్రంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని అగస్తేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి భావనతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని మంత్రి పేర్కొన్నారు. రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక సేవలు అందించారు. భక్తుల శివనామస్మరణలు, మంగళవాయిద్యాల నడుమ రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గణేష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 41 ఫిర్యాదుల స్వీకరణ





**ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేసి చర్యలు తీసుకోవాలి**

**జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్**

**కాకినాడ, పెన్ పవర్, జూలై 13:**కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, మొత్తం 41 ఫిర్యాదులను స్వీకరించారు.అందులో భూ తగాదాలకు సంబంధించినవి 16,కుటుంబ కలహాలకు సంబంధించినవి 7, ఇతర అంశాలకు సంబంధించినవి 18 ఫిర్యాదులు నమోదయ్యాయి.ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులను ఉద్దేశించి ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే ప్రతి ఫిర్యాదుపై ఏడు రోజుల్లోగా విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపడంతో పాటు నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజా సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ పేర్కొన్నారు.


## శివాలయానికి పోటెత్తిన భక్తులు.



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 13;**మాస శివరాత్రి, పరమశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు కలిసి వచ్చిన సందర్భంగా ఆలమూరు మండలం మడికి హరిహర మహా క్షేత్రంలో కొలువైయున్న శ్రీ బాల త్రిపుర సుందరి దేవి సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో మహాదేవునికి వివిధ ద్రవ్యములతో అభిషేకం ఆలయ ప్రధాన అర్చక స్వామి కాళ్ళకూరి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుండి తరలివచ్చి ఆ నీలకంఠేశ్వరునికి భక్తితో అభిషేకాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# భక్తజనంతో పోటెత్తిన శివాలయాలు





* ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు
* తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ

**కాకినాడ, పెన్ పవర్, జూలై 13:**ఆరుద్ర నక్షత్రం, సోమవారం మాస శివరాత్రి పర్వదినం ఒకే రోజు రావడంతో కాకినాడ నగరంలోని శివాలయాలు సోమవారం భక్తజనంతో కిటకిటలాడాయి. పరమేశ్వరుడికి ఈ పుణ్యదినాన అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తే విశేష ఫలితాలు కలుగుతాయని విశ్వసించిన భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భారీగా తరలివచ్చారు.నగరంలోని గాంధీనగర్‌లో వెలసిన శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు, శివపార్వతుల కల్యాణోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) బాదం శ్రీనివాస చంద్రమూర్తి మాట్లాడుతూ, ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి ఒకే రోజు రావడం విశేషమని, దీంతో తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదాల పంపిణీతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.నగరంలోని ఇతర శివాలయాల్లో కూడా రోజంతా శివనామస్మరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగగా, భక్తుల రద్దీతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

